జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 29-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 113 పేజీలు: 8 వెల : రూ.7



# విహారంలో.. విషాదం



* అమెరికాలో ఇచ్ఛాపురం విద్యార్థి రూపక్‌రెడ్డి మృతి
* సరస్సులో స్నేహితులతో కలిసి బోటింగ్
* ఫొటోలు తీస్తుండగా నీటిలోకి జారిపడి మృత్యువాత
* ఇచ్ఛాపురంలో విషాదఛాయలు
* కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** విహారంలో విషాదం నెలకొంది. అమెరికాలోని తోటి స్నేహితులతో కలిసి మంగళవారం సాయంత్రం రూపక్‌రెడ్డి ఓ సరస్సులో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపిన కొద్దిసేపటికే.. అతడిని మృత్యువు బలి తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పి.రూపక్‌రెడ్డి (26) ఎమ్మెస్ సాఫ్ట్‌వేర్ చేయడానికి కొద్ది నెలల కిందట అమెరికా వెళ్లాడు. హరీష్ బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎమ్మెస్ చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన స్నేహితులు ఐదుగురితో కలసి రూపక్ ఓ సరస్సులో బోటింగ్‌కు వెళ్లాడు. సరస్సు మధ్యలో ఉన్న రాయిపైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా రూపక్ రెడ్డితో పాటు స్నేహితుడు రాజీవ్ సరస్సులోకి జారిపోయారు. మిగతా స్నేహితులు రాజీవ్‌ను కాపాడినా, రూపక్‌ను మాత్రం రక్షించలేకపోయారు. దీనిపై అక్కడి పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రెస్క్యూ టీం సరస్సులో గాలించగా రూపక్ రెడ్డి మృతదేహం లభించింది. రూపక్‌రెడ్డి తండ్రి కవిరాజ్‌రెడ్డి ఇచ్ఛాపురం మండలం మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒడియా స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బీటెక్ పూర్తయిన తరువాత ఎంఎస్ చేయడానికి రూపక్ అమెరికా వెళ్లాడు. మంగళవారం సాయంత్రం బీచ్‌కు వెళ్లి బోటు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఇచ్ఛాపురంలో.. భూకంపం



* హడలిపోయిన ఇచ్ఛాపురం, రత్తకన్న గ్రామస్థులు * ఇంటి నుంచి బయటకు పరుగులు * పలు ఇళ్ల గోడలకు బీటలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజాము 3.42 నిమిషాలకు స్వల్పంగా భూమి కంపించినట్లు కొందరు చెబుతున్నారు. భూమి నుంచి పెద్ద శబ్దాలు వినిపించాయని, అత్యల్పంగా భూమి కంపించిందని ప్రత్యక్ష సాక్షులు జోహార్ ఖాన్, కాళ్ల నరసింహమూర్తి తెలిపారు. నమాజ్ చేసేందుకు ఆ సమయంలో తాను లేచానని.. శబ్దాలు విని భయపడ్డానని ఖాన్ వివరించారు. రెండేళ్ల క్రితం అక్టోబర్‌లో పలుమార్లు స్వల్ప ప్రకంపనలు వచ్చాయన్నారు. అయితే కొందరి ఇళ్ల గోడలు పెచ్చులూడి కిందపడ్డాయి.



# ఎరువుల ధరలు.. నియంత్రించండి

* ఎరువుల కొరత లేకుండా చూడాలి * డిసిఎంఎస్, పిఏసిఎస్, రైతు కేంద్రాల ద్వారా సరఫరా చేయాలి * జడ్పీ సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యేలు




**శ్రీకాకుళం, ఆగస్టు28(వార్త):** జిల్లాలోని ఎరువుల షాపుల్లో ధరలు నియంత్రించి, రైతులకు అందరికీ ఎరువులు అందేలా చూడాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యేలు సూచించారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అందరు సహకారం అందించాలని, ప్రాధాన్యత క్రమంలో సమస్యలపై చర్చించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖపై తీసుకున్న చర్యలపై జెడి శ్రీధర్ వివరిస్తుండగా వెబ్ లాండ్ ఓపెన్ కావడం లేదని ఆమదాలవలస శాసన సభ్యుడు కూన రవి కుమార్ ప్రస్తావించారు. రీ సర్వే వల్ల వెబ్ లాండ్ ఓపెన్ కాలేదని జెడి చెప్పారు. జిల్లాలో సాగు జరుగుతున్న వ్యవసాయానికి సరిపోయే ఎరువులు లేవని కూన రవికుమార్ సభ దృష్టికి తెచ్చారు. ఎరువులు కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు చెప్పారు. శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ డిసిఎంఎస్, పిఎసిఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలో ఎరువుల కొరతపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈ విషయంపై వ్యవసాయ శాఖ కమిషనర్‌తో ఇప్పటికే మాట్లాడడం జరిగిందన్నారు. ప్రైవేటు షాపుల్లో ధరలు అధికంగా ఉన్నాయని, వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ చెప్పారు. 62 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉండగా లక్ష ఎకరాలకు పైన వ్యవసాయం సాగులోకి వచ్చినందు వలన ఎరువుల కొరత ఉందని జెడి వివరించారు. శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రైవేటు షాపులు, కంపెనీలు, డీలర్లుతో జిల్లా కలెక్టర్ ఒక సమావేశం ఏర్పాటు చేసి ధరల తగ్గింపుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ మాట్లాడుతూ నారాయణపురం ఆయకట్టుపై సాగు అవుతున్న పెనుబర్తి గ్రామానికి ఇప్పటికీ సాగునీరు రాలేదన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం సాగు భూమి ఉండడం వలన నాగావళి నదిపై పరిపాలన నియంత్రణ జిల్లా కలెక్టర్ అధీనంలో ఉండాలని, ఇందుకు సభ తీర్మానం చేయాలన్నారు. మడ్డువలస, నారాయణపురం, నాగావళి నదులపై సాగు అవుతున్న వాటిపై గజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని శాసన సభ్యులు చెప్పగా ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు ఇఇ చెప్పారు. నాగావళి, వంశధార ఫ్లడ్ ఫండ్స్‌పై శాసన సభ్యులు కూన రవి కుమార్ అడిగి తెలుసుకున్నారు. సంబంధిత గుత్తేదారు ఫేక్ చెక్కులు ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదని ఎస్ఈని నిలదీశారు. బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వంశధార కట్టడాలు కూలుతున్నాయని, చివర వరకు సాగునీరు వెళ్లాలంటే షట్టర్స్, రిన్నోవేటెడ్ చేయాలన్నారు. శాసన సభ్యుడు మామిడి గోవిందరావు మాట్లాడుతూ గొట్టా బ్యారేజీ శిధిలావస్థకు చేరిందన్నారు.సమావేశంలో సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పాతపట్నం ఎస్ఐగా లావణ్య



పాతపట్నం, ఆగస్టు 28, (వార్త): పాతపట్నం సబ్ ఇన్స్పెక్టర్‌గా బి.లావణ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె మన్యం జిల్లా పార్వతీపురం దిశ సెల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో సారవకోట ఎస్ఐగా కూడా పని చేశారు. ఎస్ఐ లావణ్యకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, ఏవోబీ సరిహద్దుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు.

# ఆదివాసీలకు రక్షణగా ఉంటా

**-రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్**

బూర్జ, ఆగస్టు 28(వార్త): గిరిజన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు అందుబాటులో ఉంటామని ఏపీ ఎస్టీ కమిషన్‌సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన బూర్జ మండలం వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లిగూడా గ్రామంలో పర్యటించారు. అక్కడి గిరిజనులతో ముచ్చటించారు. ఏ విధంగా జీవనోపాధి పొందుతున్నారు? ఎటువంటి సదుపాయాలు ఉన్నాయి..? గిరిజనేతరుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఉన్నా యా అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సర్పంచ్ వెంకటసత్యం, గిరిజన పెద్దల నుంచి స్థానిక సమస్యలు ఏమీ ఉన్నాయని అడగ్గా, రహదారి నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. మండల, సచివాలయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 15 రోజుల్లో శ్మశానవాటికకు స్థలం మంజూరుచేస్తామని తహసీల్దార్ ఈశ్వరమ్మ హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, రాజునాయక్, సవర శోభన్, కృష్ణ, సింహాచలం, ఎంపీడీవో, ఉపాధి హామీ ఏపీవో, బూర్జ ఎస్ఐ ప్రవల్లిక, సచివాలయ సిబ్బంది, గిరిజన సంఘాల నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



సారవకోట మండలం సవర బొంతు ఆశ్రమ పాఠశాలలో అధికారులతో మాట్లాడుతన్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్



శంకర్‌నాయక్‌కు సమస్యలు వివరిస్తున్న వైకుంఠపురం సర్పంచ్ వెంకటసత్యం

### ఆశ్రమ పాఠశాల పరిశీలన

**సారవకోట:** సవర బొంతు ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..లేదా, నాణ్యమైన విద్య అందిస్తున్నారా తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన నాయకులు యోగి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



## వెంకన్న ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కొత్తూరు, ఆగస్టు 28 (వార్త): నేరడి గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. తన వంతుగా ఆలయ పునర్నిర్మాణానికి రూ.20వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా ఆలయాలు నిర్మిస్తే తన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గరుకు యతిరాజు, గరుకు శ్రీనివాస్, అగతమూడి మాధవరావు, కమలాకరరావు, టొంపల తిరుపతిరావు, బీజేపీ నాయకులు ప్రసాద్, కోయిలపు సంజీవరావు, కొత్తూరు మండల నాయకులు, నేరడి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం ఎస్ఐగా చిన్నంనాయుడు




ఇచ్ఛాపురం, ఆగస్టు 28 (వార్త): ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐగా ఈ.చిన్నంనాయుడు బుధవారం విధుల్లో చేరారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా చిన్న మేరంగి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో రూరల్ ఎస్ఐగా పని చేశారు. ఆయనను పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ యాదవ్, 17వ వార్డ్ ఇన్‌చార్జి జన్నెల సంతోష్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## పారా మిలటరీ దళాల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే బగ్గు



నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త) : నరసన్నపేటలో నూతనంగా నిర్మించిన పారామిలిటరీ అసోసియేషన్ సంక్షేమ భవనాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా మిలటరీ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వీరి అభ్యున్నతికి తన వంతు సహాయ, సహకారాలను అందజేస్తానని తెలిపారు. వీరి సమస్యల్ని కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడుతో కలిసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల పరిశీలన



నరసన్నపేట, ఆగస్టు 28(వార్త): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల తీరును ఎంఈవో ఉప్పాడ శాంతారావు బుధవారం పలు పాఠశాలల్లో పరిశీలించారు. ఈ పరీక్షలు వచ్చేనెల 6వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 5వేలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.

## లింగాలవలసలో వైద్య శిబిరం



జలుమూరు, ఆగస్టు 28 (వార్త): లింగాలవలసలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చల్ల వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వాతావరణంలో మార్పులతో సంభవిస్తున్న సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా నీటి నిలువలు లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహార పదార్థాలను భుజించాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనం ముందు, మల విసర్జన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని అవగాహన కల్పించారు. అన్ని బావుల్లో క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నరాజులు, అమ్ములు, సత్యవతి, సంతోషి, మోహిని, చిన్నారావు, వెంకటరావు, రవి, ఆశ కార్యకర్తలు జానకి, ఉమ పాల్గొన్నారు.

## అశ్రు నయనాల మధ్య లింగయ్య అంత్యక్రియలు

మందస, ఆగస్టు 28 (వార్త): భైరిసారంగపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రట్టి లింగయ్య అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య పాల్గొని, పాడెను మోశారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు మురపాల నారాయణరావు, బేపల తిరుపతిరెడ్డి(చిన్న), చింతాడ గణపతి, బాడ జగన్నాయకులు, సేనాపతి దివ్య, గున్న రమణ, వివిధ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. లింగయ్య కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.



# పెద గంతార్‌లో వచ్చేనెల 10న అమరవీరుల సభ

**■ గోడ పత్రిక ఆవిష్కరించిన రాష్ట్ర నేత తాండ్ర ప్రకాష్**




పలాస, ఆగస్టు 28 (వార్త): నక్సల్బరి, శ్రీకాకుళం విప్లవ నాయకులు పోతనపల్లి కుమార్, కామ్రేడ్ సీతారామన్న 26వ వర్ధంతి సభ పలాస మండలం లొత్తూరులోని పెదగాంతార్‌లో వచ్చే నెల పదో తేదీన నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యభారత దేశంలో కార్పొరేటీకరణ, సైనికీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసులను చంపేయాలనే దుర్మార్గపు కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ కగార్ 'బీజేపీ పాలకులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విప్లవోద్యమ నిర్మాణంతోనే వీరి దుర్మార్గాలను నిలువరించగలమన్నారు. కార్యక్రమంలో స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, స్మారక కమిటీ కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు (మల్లిబాబు), పలు ప్రజాసంఘాల నాయకులు ఆర్.మాధవరావు, బర్ల గోపి, జె.అప్పయ్య, పున్నయ్య, కామేష్, జానకమ్మ, సరస్వతమ్మ, లచ్చుమయ్య, ముఖలింగం, వాసు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పంట కాలువలో గుర్రపు డెక్క తొలగింపు



నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త) :నరసన్నపేటలోని దేశవానిపేటకు ఆనుకుని ఉన్న పంట కాలువలో గుర్రపు డెక్కను బుధవారం తొలగించారు. దీంతో సాగుకు ఏ ఆటంకం లేకుండా సాగునీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు బాగా అందడంతో పంటలు బాగా పండే అవకాశం ఉందంటున్నారు. గతంలో చాలాసార్లు అధికారులకు తెలియజేసినా, ఇప్పుడు వారు స్పందించి గుర్రపు డెక్కను తొలగించడం ఆనందదాయక మన్నారు.



## వివాహ వేడుకకు హాజరైన కలమట

కొత్తూరు/మెలియాపుట్టి, ఆగస్టు 28 (వార్త):మెళియాపుట్టి మండలానికి చెందిన వేలూరి గజపతిరావు కుమారుడు లోచన్‌బాబు వివాహ వేడుకకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని టీడీపీ కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నాయకులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

## 'రుచిగా ఆహారాన్ని వండి పెట్టాలి'

నరసన్నపేట, ఆగస్టు 28(వార్త): దేశవానిపేట ఎంపీయూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనపథకం తీరును ఎంఈవో శాంతారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేడి ఆహార పదార్థాలను రుచిగా వండి పెట్టాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతిరోజు ఆహారం రుచిగా వండుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని కోరారు.

## ఈ పంట నమోదు వేగవంతం



నరసన్నపేట, ఆగస్టు 28(వార్త): ఈ పంట నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రక్రియను వచ్చేనెల 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఈవోగా ద్రాక్షాయణి బాధ్యతల స్వీకరణ


నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త) : నరసన్నపేట మేజర్ పంచాయతీ ఈవోగా




ద్రాక్షయణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహాయ, సహకారాలతో పంచాయతీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తామన్నారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పోలాకి, ఆగస్టు 28 (వార్త): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండా లని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన పోలాకి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి వైద్యాధికారి శ్రీనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియాపై వైద్యసిబ్బంది.. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ పాల్గొన్నారు.



# 'బీజేపీ బలోపేతానికి కృషి చేయండి'

మందస, ఆగస్టు 28 (వార్త): మందసలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆ పార్టీ నేతలు ప్రారంభించారు. తొలుత గ్రామదేవత అన్నపూర్ణమ్మ తల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల కోసం బీజేపీ పని చేస్తుందని, బీజేపీ పాలనతోనే దేశాభివృద్ధి, ప్రగతి సాధ్యమన్నారు. పార్టీ సభ్యత్వం, పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గౌరంగ బెహరా, గణేష్ ఆచారి, తారకేశ్వరావు రౌళో, యవ్వారి రాజారావు పార్టీలో చేరగా, పార్టీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు పొందర దుదిష్టిపాత్రో, బీజేపీ నాయకులు డి.పున్నయ్య, ఆర్.లక్ష్మణ రావు, దేవానంద్ పట్నాయక్, హడ్డి గౌడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ

# 'విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలి'

టెక్కలి, ఆగస్టు 28 (వార్త): రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు.

బుధవారం టెక్కలిలో ఆ పార్టీ కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ జరిగింది. బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం ఈ మీటర్లను వ్యతిరేకించి హైకోర్టులో పిటిషన్లు వేసిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలను రద్దు చేయకపోగా, ఆ ప్రక్రియను కొనసాగిస్తోందని ఆరోపించారు. ఈ మీటర్లతో వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్నారు. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్నారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కె.మోహనరావు, వీజీకే మూర్తి, కె.శ్రీనివాస్, పి.తేజ, ఎం.మూర్తి, కె.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు:** విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ కొత్తూరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరుపెట్టే ప్రమాదం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, కృష్ణ, పవన్, రామారావు, జనార్దన్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.




టెక్కలిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



కొత్తూరులో నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

# భరత, కూచిపూడి నాట్య ప్రపంచ పోటీలకు సాయిమెహర్ బృందం

మందస, ఆగస్టు 28 (వార్త): మందసలోని శ్రీసాయిమెహర్ నృత్య కళానికేతన్ నాట్య బృందం ప్రపంచ భరతనాట్యం, కూడిపూడి నాట్యం పోటీలకు ఎంపికైంది. పోటీలు ఈనెల 31న వారణాసిలో జరగనున్నాయి. నాట్య గురువు నారాయణశెట్టి శైలజ ఆధ్వర్యంలో ఆకెళ్ల సౌగంధిక, పిన్నింటి పూజిత, గుడిబాటి లాస్యప్రియతో కూడిన నాట్య బృందం ఇప్పటికే వారణాసి బయలుదేరింది. ఈ బృందానికి పలువురు అభినందనలు తెలిపారు. విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.



శ్రీసాయిమెహర్ నృత్యకళానికేతన్ నాట్య బృందం

# నేత్రదానం చేయండి.. మళ్లీ జీవించండి

మందస, ఆగస్టు 28 (వార్త): నేత్రదానంపై ప్రజలకు అవగాహన అవసరమని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మద్దిల సంపత్ రావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రోణంకి వెంకటరమణ కోరారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నేత్రదానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. మరణించిన 6 గంటల లోపు నేత్రాలు దానం చేయాలని సూచించారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఐ బ్యాంకు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటిపై ఉన్న కార్నియాను మాత్రమే దాతల నుంచి సేకరిస్తారిన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓఎస్ ఎస్.కృష్ణారావు, ఎస్ఎన్ వై.హేమలత, హెల్త్ విజిటర్ ఎస్.రుక్మిణి, ఏఎన్ఎం నిర్మల, హెల్త్‌అసిస్టెంట్ ఎస్.ప్రేమ్, ఎస్.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## మతమార్పిడిపై ఉక్కుపాదం హర్షనీయం

**పొందూరు, ఆగస్టు28 (వార్త):** రాష్ట్రంలో బలవంతపు మతమార్పిడిలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉక్కుపాదం మోపుతామని హెచ్చరికలు జారీచేయడం హర్షనీయమని రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామీ శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులు ఉండకూడదని, బలవంతపు మతమార్పిడులను అడ్డుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విచ్చల విడిగా బలవంతపు మత మార్పిడులు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హిందూ ధర్మాన్ని గౌరవించేలా ఉందని ఆయన తెలిపారు.



# ఎలుకలను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు

### * పశు సంవర్ధక శాఖ జేడీ జయరాజు

**శ్రీకాకుళం, ఆగస్టు 28 (వార్త):** నరసన్న పేట మండలం తామరాపల్లి సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్సియల్ కళాశాలలో ఎలుకలు కరవడంతో అయిదుగురు విద్యార్థినులు గాయపడిన సంఘటనపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. తక్షణమే ఎలుకలను నివారించాలంటూ పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయరాజును ఆదేశించారు. ఆయన తన సిబ్బందితో బుధవారం హాస్టల్‌కు చేరుకొని ఎలుకల మందు (రొడెంటిసైట్)ను, అక్కడక్కడ ఎలుకలను పట్టుకునేందుకు బోనులను ఏర్పాటు చేశారు. వాటిని వినియోగించే విధానంపై అవగాహన కల్పించి సిబ్బందికి అందజేశారు. కళాశాలలో వీటి సంచారం ఎక్కువగా ఉండటం, రాత్రివేళలో అవి ఎక్కువగా రావడంతో అక్కడ




పారిశుధ్య నిర్వహణపై ఇప్పటికే తగు ఆదేశాలు జారీ చేశారు. ఎలుకలు కరవడంతో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్న వారి ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



## సాయికృష్ణలో న్యాయవిజ్ఞాన సదస్సు

**శ్రీకాకుళం లీగల్, ఆగస్టు28 (వార్త):** నగరంలోని సాయికృష్ణ జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ శాఖ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ న్యాయం ముందు అందరూ సమానమేనని అన్నారు. పాత చట్టాలను చిన్న చిన్న మార్పులు చేసి కొత్త చట్టాలు ఏర్పడ్డాయని తెలిపారు. వాటిపై అవగాహన అవసరమని తెలిపారు. నిరుపేదలకు న్యాయ సాయం చేసేందుకు న్యాయ సేవధికార సంస్థ ముందుంటుందని చెప్పారు. చట్టాలపైన అవగాహన లేక పోవడంతో కొందరు తప్పులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమం లో న్యాయ వాదులు జి.ఇందిరా ప్రసాద్, టి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ పి.నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 30న వన మహోత్సవం

**శ్రీకాకుళం, ఆగస్టు 28 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 30న వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సభాధ్యక్షులుగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవుతారన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలతోపాటు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయవేత్తలు, విద్యా సంస్థలు, తదితర సభ్యులు పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం లోను ఇంటింటికి ఒకమొక్క నాటే విధంగా పాఠశాల ఆవరణలో రోడ్డుకి ఇరు వైపులా, పరిశ్రమల వద్ద తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా సంబంధిత అధి కారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉత్సవ మూర్తులకు పూజలు

**అరసవల్లి, ఆగస్టు 28 ((వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు ఆలయ అనివెట్టి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు హారతి కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళ హారతులతో కార్యక్రమం పూర్తిచేశారని ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్ బాబు తెలిపారు.

## విద్యా విహార్ పాఠశాలకు గేట్ వితరణ

**పలాస, ఆగస్టు 28(వార్త):** రామకృష్ణపురం శ్రీ సత్య సాయి విద్యా విహార్ పాఠశాలకు రూ.60వేలు విలువ గల మెయిన్ గేట్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాశీబుగ్గ సభ్యులు డోకి రామారావు (ఎంజేఎఫ్) సౌజన్యంతో ఏర్పాటు చేశారు. బుధవారం ఆ గేట్‌ను క్లబ్ అధ్యక్షుడు హనుమంతు ఎండు దొర ప్రారంభించారు. అలాగే పలాస పశు సంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో సుమారు 12,200విలువగల మూడు సిమ్మెంట్ బెంచీలను డా.దేవరకొండ శారదా రాజేష్ సౌజన్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. రామకృష్ణ సేవా సమితి పలాసలో 2700 మందికి డోకి తేజ జన్మదినం సందర్భంగా అన్న దానం కార్యక్రమం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ ఎన్.అప్పారావు, బమ్మిడి నాగేశ్వరావు, డోకి రామారావు కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## డీజీపీని కలిసిన ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 28 (వార్త):** విశాఖ వచ్చిన డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును బుధవారం శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందించారు. జిల్లాలో శాంతిభద్రతలు, తదితర అంశాలపై చర్చించారు.



## ఫిష్‌కాన్ అనుసంధానంగా పనిచేయాలి




**పలాస, ఆగస్టు 28(వార్త):** ఫిష్ కాన్ మత్స్యకారులకు ప్రభుత్వా నికి అనుసంధానంగా పనిచేయాలని పలాస మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు కొమర దేవరాజు అన్నారు. బుధవారం ఫిష్ కాన్ సమావేశం పలాసలో ఫిష్ కాన్ నాయకులు బైపల్లి అశోక చక్రవర్తి ఆధ్వర్యములో జరిగింది. సమావేశంలో న్యాయ వాది, పలాస మత్స్యకార ఐక్య వేదిక అధ్యక్షుడు కొమర దేవరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫిష్ కాన్ లీగల్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు కేటాయించిన బడ్జెట్ కూడా ఖర్చు చేయలేని స్థితిలో ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పలాస మున్సిపాలిటీ కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనంద్ మాట్లాడుతూ మత్స్యకారులు మిగతా వర్గాల కంటే బాగా వెనుకబడి ఉన్నారని, మత్స్యకారులకు తగిన నాయకత్వం వహించే నాయకుడు లేకపోవడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఫిష్ కాన్ ప్రధాన కార్యదర్శి సూరాడ రాజారావు మాట్లాడుతూ ఫిష్ కాన్ శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ మంది మత్స్యకారులు ఫిష్ కాన్ సభ్యత్వాలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కొమర దేవరాజు ఫిష్ కాన్ కు పదివేల రూపాయలు విరాళం అందించారు. ఈ సమావేశంలో ఫిష్ కాన్ నాయకులు బుడగట్లపాలెంకు చెందిన కె.రాజశేఖర్, వజ్రపుకొత్తూరు, కవిటి, సోంపేట, సంతబొమ్మాళి, ఎచ్చెర్ల మండలాలకు చెందిన మత్స్యకారు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

**పొందూరు, ఆగస్టు28 (వార్త):** ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

## 'అఖండ నంది' అవార్డుకు మిశ్రో మాస్టారు ఎంపిక

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 28 (వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత లయన్ డాక్టర్ ఎంకే మిశ్రో మాస్టారుకు అఖండ నంది అవార్డు వచ్చింది. విద్యా, సామాజిక, సేవా, ఆధ్యాత్మిక రంగాల్లో మిశ్రో మాస్టారు చేస్తున్న సేవలకు గాను హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ న్యూఛర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్, మొరాద్ ఫౌండేషన్ ప్రతినిధులు అఖండ నంది అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. మిశ్రో మాస్టారుకు ఈ అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు, దివ్యాంగ సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.






## సంచార జాతుల సమస్యలపై అధ్యయనం

### బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ పి.సురేష్‌బాబు సింగ్

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 28 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న సంచారజాతులను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ పి.సురేష్‌బాబు సింగ్ బుధవారం కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచారజాతుల వారికి కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వడం లేదని, వీరిలో చాలా మందికి ఆధార్, ఓటరు కార్డులు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలకు నోచుకోవడం లేదని తెలిపారు. వీరి సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం కూడా ఇచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమాన్ని పట్టించుకోలదన్నారు. వెనుకబడిన కులాల కార్పొరేషన్ (ఎంబీసి) కు గత వైస్సార్సీపీ ప్రభుత్వం నిధులను ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సంచార జాతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక బీసీ కమిషన్ వేసి వారి జీవన విధి విధా నం, తదితర అంశాలపై అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టి తౌడు, ఉమ మహేశ్వరరావు, వెంకటరావు ఉన్నారు.

## నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

**మందస, ఆగస్టు 28 (వార్త):** కరియాపల్లి గ్రామంలో నాటు సారా తయారీని అరికట్టేందుకు గ్రామ శివార్లలో సెబ్ అధికారులు దాడులు చేశారు. స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో సోంపేట ఇన్స పెక్టర్ ఆర్. జైభీమ్, సిబ్బందితో గ్రామంలో అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటల ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ పలాస ఇన్స్పెక్టర్ రామచంద్ర కుమార్, ఎస్.ఐ చంద్ర మోహన్ సెబ్ సిబ్బంది మోహన రావు, కాంతారావు, యోగేశ్వర్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి మహిళ మృతి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28 (వార్త):** ముచ్చింద్ర గ్రామానికి చెందిన సాడి జానకమ్మ (45)పై బుధవారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందింది. ఈమె పొలములో వరి నాట్లు వేస్తుండగా సాయంత్రం సుమారు 5గంటల సమయంలో వర్షంతో పాటు ఉరుములు మెరుపులు రావడంతో పిడుగుపడింది. నాట్లు వేస్తున్న తోటి మహిళలు ఆమెను ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

## నరసన్నపేటలో వివాహిత ఆత్మహత్య

**నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త):** నరసన్నపేటలోని ఒక అపార్ట్మెంట్లో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలకు వెళితే.. బుధవారం స్థానిక విఎస్ఆర్ ఎన్క్లేవ్ అపార్ట్మెంట్లో బరాటం అనురాధ (22) ఉరేసుకుని మృతి చెందిందని భర్త బరాటం శ్రవణ్ తెలిపారు. అయితే ఇది ఆత్మహత్య కాదని.. హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆరోపించారు. ఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు.

## సకాలంలో నిర్మాణం చేపట్టండి

**మెళియాపుట్టి, ఆగస్టు 28 (వార్త):** ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని సీతంపేట ఐటిడిఎ పిఓ వివి రమణ అన్నారు. బుధవారం మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పాతపట్నంలో ఏకలవ్య పాఠశాల నిర్వహణ జరుగుతున్న విషయమై అక్కడ ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నరాన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అధికారులు సింహాచలం, శ్రీకాంత్ ఉన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413